క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి కృషి



ఆత్మకూరు : మండల కేంద్రంలోని మహిమాన్విత పార్వతీదేవి సమేత మహాదేవస్వామి పంచకూట శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పంచకూట శివాలయాన్ని సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయాన్ని అద్భుతంగా నిర్మించిన కమిటీని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. శివాలయం పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి, పూజారి రవీందర్‌శర్మ, బీజేపీ మండల అధ్యక్షుడు బలవంతుల రాజు, నాయకులు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, బయ్యపైడి ఆచార్య, సదానందం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. చైతన్యపురి కాలనీ, బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ -1 ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, గోపాల్‌పూర్ కల్లు మండువా, ఎఫ్‌సీఐ కాలనీ, శివసాయి కాలనీ, విద్యాధరి స్కూల్, వెంకటేశ్వర కాలనీ, అరుణోదయ కాలనీ, బృందావన్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మార్బుల్స్, టైల్స్ కార్మికులను ఆదుకోవాలి

రామన్నపేట: ఇతర రాష్ట్రాల దుకాణదారులు, బిల్డర్ల కారణంగా స్వరాష్ట్రంలో తమకే పనిలేకుండా పోయిందని, ఈ క్రమంలో ప్రభుత్వం ఆదుకోని న్యాయం చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల పాలీష్, మార్బుల్, గ్రానైట్, స్టోర్, టైల్స్, పాలీష్ మెషీన్, ఫ్లోరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ సమీర్ కోరారు. ఈమేరకు నగరంలోని మండిబజార్‌లో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ స్వరాష్ట్రం వస్తే కార్మికుల జీవితాలు మారుతాయని అనుకుంటే నానాటికి పరిస్థితులు దుర్భరంగా మారుతున్నాయని అన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతలకు సన్మానం

హన్మకొండ అర్బన్: ఇటీవల భువనగిరిలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్ -17 పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టు సభ్యులు, హుస్నాబాద్‌లో జరిగిన హ్యాండ్‌బాల్ అండర్ -14 బాయ్స్ విజేతలు, రన్నర్స్ జట్టులోని బాలికల క్రీడాకారులు, కోచ్‌లు, పీడీలను హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో పీడీలు ప్రభాకర్‌రెడ్డి, గ్రీష్మ, సునీల్, రాజేశ్వరి, అరుణ్, వెంకటేశ్వర్లు, బాలమురళీకృష్ణ, శ్రీధర్, రాముడు, కుమారస్వామి, రాజు, కిషన్, దేవేందర్, కైలాష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కరాటేలో రైల్వే సీనియర్ టెక్నీషియన్ ప్రతిభ

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్‌కేఏఐ గ్రాండ్‌మాస్టర్ నాయిని సదానందంకు కరాటేలో 8వ డాన్ జపాన్ డిప్లమా ప్రదానం చేశారు. గోవా నగరంలో ఈనెల 10వ తేదీన నిర్వహించిన పునకోసి షోటోకాన్ కరాటే ట్రైనింగ్ అండ్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సదానందం పాల్గొన్నారు. జపాన్ గ్రాండ్ మాస్టర్ కెవిన్ పునకోసి బృందం సమక్షంలో సదానందంను అభినందించి జపాన్ డిప్లమాను అందజేశారు.

చంద్రపూర్ ఎన్నికల పరిశీలకుడిగా రామకృష్ణ



హన్మకొండ చౌరస్తా: మహారాష్ట్రలోని చంద్రపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎన్నికల పరిశీలకుడిగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ రాజేష్ లిలోథియా నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద 60ఎంఎల్‌డీ నీటి శుద్ధీకరణ కేంద్రం వద్ద టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని పలు ప్రాంతాలకు తాగునీటి మంగళవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బల్దియా ఈఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రారంభించారు.. వదిలేశారు

- అలంకారప్రాయంగా రైతుబజార్
- పదినెలలు దాటినా పురోగతి కరువు
- అధికారులు చొరవ చూపాలని స్థానికుల విజ్ఞప్తి



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న రైతుబజార్

ఆత్మకూరు : మండల కేంద్రంలో దామెర మండలం ఊరుగొండకు చెందిన ఎన్ఆర్ఐ గొంది నర్సింహారెడ్డి జీఎస్ఎం ట్రస్ట్ ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలనే ఉద్దేశంతో 10 నెలల క్రితం తన బాల్యమిత్రుడు డాక్టర్ బూర గోపాలకృష్ణ స్మారకార్థం రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ రైతు బజార్‌ను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్థానిక నేతలు, అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. ఒకటి, రెండు రోజులు కొనుగోళ్లు, అమ్మకాలు జోరందుకున్నాయి. కానీ ఆ తర్వాత రైతుబజార్ మూతపడింది. అన్ని వసతులతో ఎన్ఆర్ఐ స్వంత నిధులతో నిర్మించిన రైతుబజార్ నిర్వహించలేకపోవడానికి కారణాలేంటని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితం నుంచే ఈ ప్రాంతంలో వారాంతపు సంత కొనసాగేదని పలువురు తెలిపారు. కానీ ప్రస్తుతం రైతు బజార్‌ను నిర్వహించలేకపోవడంతో పలు విమర్శలకు దారితీస్తుంది. గ్రామపెద్దల ఆలోచనలు, సలహాలు తీసుకొని గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిరువ్యాపారులకు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని స్థానికులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

> **వినియోగంలోకి తీసుకురావాలి**
>
> ఆత్మకూరులో ఎన్ఆర్ఐ నర్సింహారెడ్డి ఏర్పాటు చేసిన రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. చిరువ్యాపారులతో మాట్లాడి రైతు బజార్‌ను నడిపిస్తే సౌకర్యంగా ఉంటుంది. అధికారులు దృష్టిసారించాలి.
>
> - సంతోష్‌గౌడ్, ఆత్మకూరు

సాంబయ్య సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి

ఆత్మకూరు : సీపీఐ నాయకుడు అంబి సాంబయ్య సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో సోమవారం సీపీఐ నాయకుడు అంబి సాంబయ్య సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలపక్షాన సాంబయ్య చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కొట్టె రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోతు శంకర్‌నాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెల్లి రవి, దాడి రవి, భరత్, రమేశ్, రామన్న, రమ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా కొనసాగించాలి

- ఎంపీడీఓ గుండె బాబు



సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను పకడ్బందీగా కొనసాగించాలని ఎంపీడీఓ గుండె బాబు ఎన్యుమరేటర్లకు సూచించారు. మండలంలోని అంబాల, శ్రీరాములపల్లి, గూడూరు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను సోమవారం ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతితో పాటు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపర్చేందుకు ప్రణాళికలు తయారు చేయడం, వాటిని అమలు చేయడం కోసమే సర్వే చేపట్టినట్లు తెలిపారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీఓ రవి, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్యార్మీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



గ్యార్మీ షరీఫ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో సోమవారం ముస్లింల గ్యార్మీ షరీఫ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులమత బేధాలు లేకుండా ముస్లింలు గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలను జరుపుకొంటారని తెలిపారు. ప్రతిఒక్కరూ న్యాయబద్ధమైన జీవితం గడపాలని, ప్రపంచ శాంతి కోసం పాటుపడాలని సూచించారు. ప్రతి ఏటా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలను ప్రపంచమంతా ముస్లిం సోదరులు ఎంతో సంతోషంగా జరుపుకొంటారని, మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గాలను అనుసరించి ముందుకెళ్లాలని కోరారు.

సంక్షిప్తంగా

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

కమలాపూర్ : మండలంలోని కానిపర్తి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన మండలంలోని ఉప్పల్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మొండెద్దుల నర్సయ్య (నరేష్)పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శంభునిపల్లికి చెందిన పెండ్యాల ప్రభాకర్‌రెడ్డి తన భార్య భాగ్యలక్ష్మితో కలిసి ఆదివారం వేకువజామున (టీఎస్ 03 ఎఫ్ఎఫ్ 0250) నంబరు గల కారులో శంభునిపల్లి నుంచి కమలాపూర్ వైపు వెళ్తున్నారు. కానిపర్తి శివారులో (టీఎస్ 03 ఈక్యూ 2343) నంబరు గల ట్రాక్టర్‌లో పరిమితికి మించి పశుగ్రాసం తీసుకొస్తూ అజాగ్రత్తగా నడుపుతూ కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రభాకర్‌రెడ్డి దంపతులకు తీవ్ర గాయాలు కాగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. క్షతగాత్రుల అల్లుడు చింతకుంట్ల దేవేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ఎల్కతుర్తి : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని మల్లారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన నాగిళ్ల రాజు (38) గత ఐదు సంవత్సరాల నుంచి మద్యానికి బానిసై భార్యను మానసికంగా వేధించడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో రాజు ఒంటరి జీవితంతో మనస్థాపం చెంది తన వ్యవసాయ బావివద్ద ఈనెల 10వ తేదీన గుర్తు తెలియని గడ్డిమందు తాగాడు. గమనించిన రైతులు వెంటనే 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రాజు సోమవారం చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

స్టార్టర్, విద్యుత్ తీగలు దగ్ధం



వేలేరు : మండల కేంద్రానికి చెందిన సూత్రపు రాజయ్య, భిక్షపతి వ్యవసాయ బావివద్ద గుర్తు తెలియని వ్యక్తులు పశువుల మేతకు చుట్టించిన గడ్డి కట్టలకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో విద్యుత్ స్టార్టర్, విద్యుత్ తీగలు, మోటర్ పైపులు కాలిపోయాయని బాధిత రైతులు వాపోయాడు. సోమవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిచూస్తే బావి వద్ద కట్టలు, విద్యుత్ స్టార్టర్, తీగలు, మోటర్‌పైపులు పూర్తిగా కాలిపోయాయని సుమారు రూ.40 వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ఆలయంలో పూజలు



వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో గల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా సందడి నెలకొంది. అర్చకులు భంగిమఠం స్వార్థిక్ ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నపూజ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. దొడ్డ ఈశ్వరయ్య, జైపాల్, కుమారస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

వేలేరు : మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన ఎడ్ల మల్లయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్వతంత్ర యూత్ అధ్యక్షుడు అఖిల్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం అందించారు. యూత్ ఉపాధ్యక్షుడు కందారపు ప్రవీణ్, హర్షిత్, అఖిల్, శివశంకర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు మండల కన్వీనర్ తుడుం వెంకటేశ్ తెలిపారు. అధ్యక్షుడిగా పోతుగంటి సాంబరాజు, అధికార ప్రతినిధిగా రమేశ్, ఉపాధ్యక్షులుగా తుడుం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా పెండెం కిరణ్, ప్రచార కార్యదర్శిగా సురేంద్ర, సహాయ కార్యదర్శిగా రవీందర్, సంయుక్త కార్యదర్శిగా హర్ష, మహేందర్, కార్యవర్గ సభ్యులుగా రాజు, శీను, సుభాశ్, మహేందర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నియామకం



కమలాపూర్ : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని మాదన్నపేటకు చెందిన కత్తి రమేశ్‌ను నియమించినట్లు ఆ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రమేశ్‌కు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించినందుకు రమేశ్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కో కన్వీనర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహన కల్పించేందుకే ప్రహరీ క్లబ్



మాట్లాడుతున్న ఎస్సై ప్రమోద్‌కుమార్

శాయంపేట : మండలంలోని విద్యార్థులకు సత్ప్రవర్తన, ఇతర అంశాలు, వ్యసనాలతో వచ్చే అనారోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రహరీ క్లబ్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ వెల్లడించారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గల సీఎస్ఐ బీజేఎం ఉన్నత పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సామ్ జార్జ్ ఏర్పాటు చేసిన ప్రహరీ క్లబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రహరీక్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లిబియా, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, రాజునాయక్, రాజన్న, శామ్యూల్, విజయ్, శైలజ, మౌన్య, ఉమ, శృతి తదితరులు పాల్గొన్నారు.

మాటలతోనే మురిపిస్తున్నారు..



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

శాయంపేట : మండలానికి అంబులెన్స్ కేటాయిస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రతీ సమావేశంలో చెప్పినా ఇప్పటి వరకు అంబులెన్స్ జాడ లేదని, మాటలతోనే మురిపిస్తున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. మండల కేంద్రలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి అంబులెన్స్ లేకపోవడం వలన ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు సరియైన సమయానికి వైద్యం అందక మృతి చెందుతున్నారని మండిపడ్డారు. ఇటీవల మాందారిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ లేక సమయానికి వైద్యం అందకపోవడంతో ముగ్గురు కూలీలు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. శాయంపేటలో గోడ కూలిన ప్రమాదంలో వైద్య సదుపాయం అందుబాటులో లేకపోవడంతో మహిళ మృతి చెందిందని గుర్తు చేశారు. మండలంలో జరిగిన ప్రతీ సమావేశంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు అంబులెన్స్‌కు నిధులు మంజూరు చేశానని, అదిగో వస్తుంది.. ఇదిగో వస్తుందని చెప్పడంతోనే సరిపోతుందని విమర్శించారు. వెంటనే అంబులెన్స్‌ను కేటాయించాలని కోరారు. నాయకులు బాసాని విద్యాసాగర్, ఉప్పు రాజు, కొత్తపెల్లి శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి



భూమిపూజ చేస్తున్న కమిటీ సభ్యులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని తీగల బావి వద్ద గల భక్తాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంద అశోక్, గౌరవ అధ్యక్షులు కట్కూరి తిరుపతిరెడ్డి, మాటం రమేశ్ కోరారు. భక్తాంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనులకు సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో రేకుల షెడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం హిందూ బంధువులు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందిస్తే ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం అందించి ఆలయ అభివృద్ధిలో భక్తులు, దాతలు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పూజారి, భక్తులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కేసులు



గుడుంబా తరలిస్తున్న వారిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

శాయంపేట : ప్రభుత్వ హెచ్చరికను పట్టించుకోకుండా గుడుంబా తయారీ, విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ తాతాజీ హెచ్చరించారు. మండలంలోని సూర్యానాయక్‌తండా గ్రామ శివారులో సోమవారం తెల్లవారు జామున రూట్ వాచ్ నిర్వహిస్తుండగా తండాకు చెందిన మాలోతు కొమురయ్య, మాలోతు సమ్మక్క, జర్పుల రవీందర్, జర్పుల కవిత రెండు ద్విచక్ర వాహనాలపై 48 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి నలుగురి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, కానిస్టేబుల్ అఖిల్‌కుమార్ ఉన్నారు.

అబుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



దామెర : మౌలానా అబుల్ కలాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- అబుల్ కలాం చిత్రపటానికి నివాళి
- వివిధ పాఠశాలల్లో జయంతి ఉత్సవాలు

దామెర : దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఒగ్లాపూర్ ఎస్‌బీఐటీలో గల మైనారిటీ పాఠశాలలో ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరయ్యారు. ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు. మహనీయుల త్యాగాలు, దేశానికి చేసిన సేవలను ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైలానీ బాబా దర్గా పీఠాధిపతి సైలానీ బాబా, పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరకాల : విద్యతోనే ప్రతీ వ్యక్తికి గౌరవం లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ నల్ల మల్లయ్య అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. మౌలానా ఏర్పాటు చేసిన సంగీత, సాహిత్య, నాటక అకాడమీల విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ భీంరావు, మహేందర్‌రావు, జగదీశ్‌బాబు, సమ్మయ్య, ఈశ్వర్, డాక్టర్ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శాయంపేటలో..



పరకాలలో..

శాయంపేట : మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పృథ్వి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆజాద్ వారసత్వాన్ని గౌరవించాలని, అందరికీ ఉజ్వలమైన, సమగ్రమైన భవిష్యత్‌కు మూలస్తంభంగా విద్య నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మామిడి అనురాధ, ఉపాధ్యాయులు శివ, రాజేందర్, వెంకట్, సందీప్, స్వాతి, ప్రసూన, నాగలత, సౌమ్య, మౌనిక, మాధవి, జయ, సంధ్య, జ్యోత్స్న పాల్గొన్నారు.

'మల్లికాంబ'కు ఎన్పీడీసీఎల్ విరాళం



విరాళం అందిస్తున్న ఎస్ఈ వెంకటరమణ

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి టీజీ ఎన్పీడీసీఎల్ విరాళాన్ని అందించింది. మల్లికాంబ మనోవికాస కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ రూ.20 వేల చెక్కును నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ, దివ్యాంగులు, వృద్ధాశ్రమాలకు చేయూతనందించేందుకు ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ప్రత్యేకంగా సహాయ నిధిని ఏర్పాటు చేసి ప్రతినెలా కొంతమొత్తాన్ని పోగు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నవీన్, ఏడీఈ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.